ఇంటర్ విద్యార్థులకు సర్టిఫికెట్లు సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మార్చి-2023లో ఉత్తీర్ణులైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల సర్టిఫికెట్లను జిల్లా వృత్తివిద్యా అధికారి బి.ప్రభాకర్‌రావు ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌కు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ 2014 నుండి 2023 వరకూ ఉత్తీర్ణులైన విద్యార్థుల సర్టిఫికెట్లను డీజీ లాకర్ సిస్టంలో భద్రపరిచామని తెలిపారు. వాటిని ఎలా ఓపెన్ చేసి డౌన్లోడ్ చేసుకోవాలో విద్యార్థులకు చూపించామన్నారు. అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలకు సంబంధించిన ప్రిన్సిపల్స్ ఈ నెల 12వ తేదీలోగా సర్టిఫికెట్లు అందజేసి రిపోర్టును తమ కార్యాలయానికి పంపాలని తెలిపారు. పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పిడిబిటి కళాశాల ప్రిన్సిపల్ సూర్యనారాయణ, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వీర్రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాడి తప్పిన పరీక్షల నిర్వహణ..!

విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు సైతం ఇవ్వని విద్యాశాఖ
బోర్డుపై ప్రశ్నలు చూసి పరీక్ష రాయాల్సిన దుస్థితి
45 నిమిషాల్లో రాయాల్సిన పరీక్ష గంటన్నరపైనే
విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకూ పరీక్షే
ప్రభుత్వ విధానాలతో మసకబారుతున్న విద్యావ్యవస్థ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నాడు-నేడు' అంటూ హడావుడి చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు అత్యంత ముఖ్యమైన చదువు, పరీక్షల విషయంలో మాత్రం ఏమాత్రం పట్టించుకోని దుస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కునరిల్లుతుండగా పరీక్షల నిర్వహణ విధానంసైతం అస్తవ్యస్తంగా తయారైంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రతియేటా ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-3, ఎఫ్ఎ-4 పరీక్షలతోపాటు, ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలను విద్యాశాఖ నిర్వహిస్తోంది. పరీక్ష అంటే ప్రశ్నాపత్రాలు ఇస్తే విద్యార్థులు వాటికి సమాధానాలు రాయాలి. అయితే ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-3కి ప్రశ్నాపత్రాలు ఇస్తున్న విద్యాశాఖ, ఎఫ్ఎ-2, ఎఫ్ఎ-4 పరీక్షలకు మాత్రం ప్రశ్నాపత్రాలు ఇవ్వడం లేదు. పరీక్షకు గంటన్నర ముందు వాట్సాప్‌లో ప్రశ్నాపత్రం స్కూళ్లకు పంపుతున్నారు. ఈ పేపర్‌లో ప్రశ్నలను ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తే, ఆ ప్రశ్నలను విద్యార్థులు రాసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఉంది. ఈ నెల మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ మూడు రోజులపాటు ఎఫ్ఎ-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా లెక్కలు తీస్తే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మూడు వేలకుపైగా ఉన్నాయి. వీటిలో మూడు లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎఫ్ఎ పరీక్షలకు సమయం 45 నిమిషాలు మాత్రమే. 20 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నలు బోర్డుపై ఉపాధ్యాయులు రాస్తే వాటిని రాసుకుని పరీక్ష రాయడానికి విద్యార్థులకు గంటన్నరకుపైగా పడుతోంది. ఈ విధానంలో కాపీయింగ్ పెద్దఎత్తున సాగుతోంది. బోర్డుపై రాసేందుకు ఉపాధ్యాయులు సైతం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట అన్ని ప్రశ్నాపత్రాలు బోర్డుపై రాయడం కష్టతరంగా మారడంతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా నిర్వహిస్తున్న పరీక్షల విధానంపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎస్ఎ-1, ఎస్ఎ-2 పరీక్షలకు ప్రశ్నాపత్రం ఇస్తున్నప్పటికీ జవాబులు రాసేందుకు ఇచ్చే తెల్లకాగితాలు విద్యాశాఖ ఇవ్వడం లేదు. పరీక్షలకు సంబంధించి విద్యార్థుల నుంచి ఎటువంటి ఫీజులూ వసూలు చేయరాదని నిబంధనలు చెబుతున్నాయి. ఎక్కడైనా వసూలు చేసేందుకు ప్రయత్నించినా ప్రధానోపాధ్యాయులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో ప్రభుత్వ విద్య పూర్తిగా గాడితప్పింది. ఇప్పుడు పరీక్షల విధానంలో విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వకపోతే విద్యార్థులు ఏవిధంగా పరీక్షలు రాయాలో ప్రభుత్వమే చెప్పాలి. పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందా అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందినవారే. ఈవిధంగా పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులు ఏవిధంగా చదువులో రాణిస్తారో ప్రభుత్వమే చెప్పాలి. ప్రశ్నాపత్రాలు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం పలు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'స్పీడ్ గన్'కు చిక్కొద్దు..!

అతివేగం వల్లే రోడ్డు ప్రమాదాలు
నివారణకు ప్రత్యేక చర్యలు
జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు
డిటిసి ఎస్.రమాదేవి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

'రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ ప్రభావం ఆ కుటుంబం మొత్తం మీద పడుతుంది.. పెద్దదిక్కును కోల్పోయి భార్యా, పిల్లలు రోడ్డున పడతారు. జీవితాంతం నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉంటూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే అందరూ సంతోషంగా ఉంటారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ ధరించాలి. ఇలాంటి చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పెద్దపెద్ద ప్రయోజనాలుంటాయి' అని జిల్లా ఉపరవాణా కమిషనర్ ఎస్.రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : వాహనవేగ నిర్ధారణకి ఏర్పాటు చేసిన స్పీడ్‌గన్‌ల ఉపయోగం ఎలా ఉంది?

అతివేగమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో స్పీడ్ గన్లను వినియోగించి జిల్లాలోని ట్రాఫిక్ పోలీసులతో కలిసి సంయుక్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నాం. వేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి చలానాలు విధించి తగిన చర్యలు తీసుకుంటున్నాం. దీంతో వాహనదారులు అప్రమత్తంగా ఉంటున్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించగలుగుతున్నాం. చాలావరకూ వాహనవేగ నియంత్రణ సాధ్యమైంది.

ప్రశ్న : రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన ప్రత్యేక చర్యలేమిటి?

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఇటీవల జిల్లాలో మూడు రోజులపాటు మెగా హెల్మెట్ డ్రైవ్ రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాం. ఈ స్పెషల్ డ్రైవ్ ముఖ్యోద్దేశం వాహనదారులకు జరిమానాలు విధించడం కాదు. కేవలం వారు రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు అవగాహన కల్పించడం మాత్రమే చేపట్టిన ఈ కార్యక్రమం. జిల్లావ్యాప్తంగా మూడురోజులపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం. అనేకమంది వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాం.

ప్రశ్న : ప్రతీ ఏడాది రోడ్డు ప్రమాదాలు పెరగడానికి కారణాలు?

ప్రతి ఏడాదీ రోడ్డు ప్రమాదాలపై పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రమాదాలు మాత్రం ఆగడంలేదు. దీనికి కారణం ఏయేటికాయేడు పెద్దమొత్తంలో వాహనాల కొనుగోలు పెరగడమే. కనీస నిబంధనలు కూడా తెలియని వారు వాహనాలను నడుపుతున్నారు. ఎక్కువ ప్రమాదాలు మద్యం మత్తులో వాహనాలు నడపడం ద్వారా జరుగుతున్నాయి.

ప్రశ్న : 'సారథి వాహన పరివార్' వల్ల ప్రయోజనాలేంటి?

ఇండియన్ యూనియన్ డ్రైవింగ్ లైసెన్సులను 'సారథి వాహన పరివార్'లో పొందుపరచబడి ఉంటాయి. దీనివల్ల ఒక వ్యక్తి తన వాహనం పోయినా లేదా వాహన వివరాలు తెలుసుకోవాలనుకున్నా ఏ రాష్ట్రం వ్యక్తి అయినప్పటికీ వారి వివరాలు పొందుపరచబడి ఉండడం వల్ల వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ప్రశ్న : 'ఇ-ప్రగతి' ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రవాణా శాఖ నుండి మెరుగైన సేవలు ఏమైనా అందుబాటులోకి రానున్నాయా?

ప్రస్తుతం ఇ-ప్రగతి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దాదాపు 82 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా వాహనాల చెక్ పోస్ట్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓనర్‌షిప్ మాత్రం ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కూడా అతిత్వరలో ఆన్‌లైన్ చేయడం ద్వారా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు రవాణా శాఖ కృషి చేస్తుంది.

ప్రశ్న : అక్టోబర్‌లో ప్రభుత్వం అందించిన వాహనమిత్ర వివరాలు తెలియజేయండి.

వాహనమిత్ర ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2019-20లో 17,101 మందికి రూ.17.10 కోట్లు, 2020-21లో 19,521 మందికి రూ.19.52 కోట్లు, 2021-22లో 18,015 మందికి రూ.18 కోట్లు అందజేశారు. ఏలూరు జిల్లాలో 2022-23లో 10,303 మందికి రూ.10.30 కోట్లు ప్రభుత్వం అందజేసింది. ఐదో విడతగా 2023-24లో 10,490 మందికి రూ.10.49 కోట్లు ఇటీవల విడుదల చేశారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి ప్రజలకు మీరిచ్చే సలహాలు, సూచనలు?

ఇంటి నుండి బయటకు వచ్చేటప్పుడు సెల్ ఫోన్ ఎంత జాగ్రత్తగా, భద్రంగా మన వెంటతెచ్చుకుంటామో.. అంతే భద్రంగా హెల్మెట్ కూడా తెచ్చుకుని ధరించాలి. వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధారణ తప్పనిసరి అని భావించాలి. మీరు వాహనాలకు పన్ను, ఇన్స్యూరెన్సులు కడుతున్నప్పటికీ ఇప్పుడు కొత్త నిబంధన ప్రకారం ఇన్స్యూరెన్స్ పాలసీలకు వాటి నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలి. లేకుంటే బీమా వర్తించదు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి. కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలి. రోడ్డు భద్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలి. మలుపుల వద్ద అప్రమత్తంగా వాహనం నడపండి. ఆదీనంగా ఓవర్‌టేక్ చేయొద్దు. మితిమీరిన వేగం అత్యంత ప్రమాదకరం. వాహన నియంత్రణ తప్పితే భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. మలుపుల వద్ద ఓవర్‌టేక్ చేయకండి.

మళ్లీ వైసిపిదే విజయం : కోటగిరి

ప్రజాశక్తి - చింతలపూడి

వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైసిపి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రగఢవరం బిసి కాలనీలోని కోదండ రామాలయానికి దేవాదాయ శాఖ బోర్డు ద్వారా రూ.ఐదు లక్షల చెక్కును గ్రామ ప్రజలకు ఆయన ఆదివారం అందించారు. ఈ సందర్భంగా పలువురు తమకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని కోరారు. ప్రగఢవరం మాలపల్లి ప్రజలు వాటర్ ట్యాంకు నిర్మించాలని, గుట్టమీద గ్రామస్తులు తమకు కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరడంతో వాటి నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించారని, వచ్చే ఎన్నికల్లోనూ వైసిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ గంట పద్మశ్రీ, చింతలపూడి ఎఎంసి చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు నీరజ, ఎంపిపి రాంబాబు, వైసిపి లింగపాలెం మండల అధ్యక్షులు కొదాల మోహన్‌రావు, వైసిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు టూటౌన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ శుభ శేఖర్ ఈ కౌన్సెలింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలిసీ తెలియక ఏదైనా కేసుల్లో ఉండి రౌడీషీట్‌ను ఓపెన్ చేస్తే మంచి ప్రవర్తనతో ఉంటే వారిపై రౌడీ షీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. రౌడీ షీట్లు కలిగి ఉండి ప్రజాశాంతికి లేదా ప్రయివేటు సెటిల్‌మెంట్‌లకు ప్రయత్నిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్ల జీవనోపాధికి వారు ఏయే వృత్తులు నిర్వహిస్తున్నారనే విషయాలపై ఎస్ఐ ఆరా తీశారు.

ఎబిఎస్‌వికెలో రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం ఈ నెల 10వ తేదీ మంగళవారం ఉదయం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తారని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. తేజ హాస్పిటల్ అధినేత డాక్టర్ పొన్నమండ చంద్రశేఖర్‌వర్మ అవసరమైన వారికి ఇసిజి, ఎకో పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని అంతా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ

గంగానమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక గానుగులపేటలోని జరుగుతున్న గంగానమ్మ జాతరలో యాత్రికులు ఇబ్బంది పడకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఏలూరు టూ టౌన్ ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. జాతర ఏర్పాట్లను ఆయన ఆదివారం పర్యవేక్షించారు. యాత్రికుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఆటంకాలు కలగకుండా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. యాత్రికులు క్యూ లైన్ పాటించి, వారివిలువైన వస్తువులను జాగ్రత్త చేసుకోవాలని, తోపులాట జరగకుండా కమిటీ సభ్యులు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - లింగపాలెం

స్థానిక పిహెచ్‌సి వైద్యురాలి వేధింపులను తట్టుకోలేక ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్యారాణి తన పరిధిలో పనిచేస్తున్న ఎఎన్ఎం చోడగిరి శర్వాణిని గత కొంతకాలంగా వేధిస్తుంది. ఈ నేపథ్యంలో రాత్రి 11 గంటల సమయంలో శర్వాణి నిద్రమాత్రలు మింగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కె.గోకవరంలోని పిహెచ్‌సికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఆందోళన చేస్తున్న ఎఎన్ఎంలు

శర్వాణి

ఎఎన్ఎంల ఆందోళన

సంధ్యారాణి వేధింపులపై మండలంలోని ఎఎన్ఎంలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. శర్వాణిని సంధ్యారాణి వ్యక్తిగతంగా దూషించడంతోపాటు, కుటుంబ సభ్యులను సైతం ఇబ్బంది పెడుతుందన్నారు. ఈ అవమానాలు భరించలేకే ఆమె మనస్తాపానికి గురై ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిందన్నారు. సంధ్యారాణిపై చర్యలు తీసుకోకపోతే లింగపాలెం పిహెచ్‌సి వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలని చెప్పా: సంధ్యారాణి

విధులు సక్రమంగా నిర్వర్తించాలని, సమయానికి రావాలని మాత్రమే హెచ్చరించానని పిహెచ్‌సి వైద్యురాలు సంధ్యారాణి చెప్పారు. ఆమె తరచూ విధులకు ఆలస్యంగా వచ్చేదని, దీనిపై పలుమార్లు వారించాను తప్ప ఎలాంటి వేధింపులకూ పాల్పడలేదని ఆమె తెలిపారు.

సురక్ష క్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, డిఎంహెచ్ఒ శర్మిష్ట

10.84 లక్షల మంది ఆరోగ్య సర్వే పూర్తి

63,226 ఒపి నమోదు
ఉచితంగా 27 రకాల మందులు పంపిణీ
డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతీ ఇంటి తలుపు తట్టి అందరికీ ఆరోగ్య సేవలు అందించాలన్న సిఎం జగన్ సంకల్పంతో ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జిల్లాలో విశేష స్పందన లభిస్తోందని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నేతృత్వంలో పటిష్టమైన కార్యాచరణతో అత్యంత సమర్థవంతంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముందుకు సాగుతుందన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధుల సహకారం, వివిధ శాఖల సమన్వయంతో ఆరోగ్య సురక్ష విజయవంతంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఇప్పటి వరకూ జిల్లాలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇప్పటి వరకూ 10,84,722 మందిని సర్వే చేశారని, 16,63,514 మందికి రక్త పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఇప్పటి వరకూ గ్రామీణ ప్రాంతాల్లో 153, పట్టణ ప్రాంతాలలో ఎనిమిది కలిపి మొత్తం 161 శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ శిబిరాల్లో 63,226 మందిని పరీక్షించగా అందులో 854 మందిని వివిధ ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశామని, మరో 5,110 మందికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఈ శిబిరాల్లో 127 రకాల మందులను అందుబాటులో ఉంచామని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నెలరోజులకు సరిపడా మందులు అందిస్తున్నామని పేర్కొన్నారు.

అర్బన్ పరిధిలో ఒక్కో యుపిహెచ్‌సి పరిధిలో ఒక్కో శిబిరం నిర్వహించాలని తొలుత నిర్ణయించారని, అయితే ఈ కార్యక్రమానికి వస్తున్న స్పందన చూసి మూడు నుంచి నాలుగు శిబిరాలు పెట్టాలని నిర్ణయించారని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరాల్లో కంటి వైద్యం కోసం వస్తున్నవారి సంఖ్య కూడా గణనీయంగా ఉండటంతో ప్రతీవైద్య శిబిరంలోనూ నేత్ర వైద్యుడి సేవలను తప్పనిసరి చేశారు. వైద్య సేవల్లో లోటులేకుండా ప్రతిశిబిరాన్ని వైద్య సిబ్బందితో పాటు మండల అధికారులు, ఒకస్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షించేలా చర్యలు చేపట్టామని వివరించారు. వైద్య శిబిరాల నిర్వహణకు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో శిబిరానికి రూ.30 వేలు, అర్బన్ ప్రాంతాల్లో రూ.60 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వైద్య శిబిరంలో పది డెస్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఒకటి హెల్ప్ డెస్క్ కాగా, రెండోది రిజిస్ట్రేషన్ డెస్క్ ఎంబిబిఎస్ వైద్యులు, స్పెషలిస్టులు, నేత్ర వైద్యులు, పరీక్షలు, మందులు, సర్వేలో పాల్గొనని వారికి బిపి, షుగర్ చెక్ చేసేందుకు వేర్వేరు డెస్కులను ఏర్పాటు చేశామని డిఎంహెచ్ఒ తెలిపారు.

వైద్యుల సంఖ్య - ఒపి-63,226	
వైద్యాధికారులు	120
గైనకాలజిస్టులు	28
జనరల్ మెడిసిన్	19
పీడియాట్రిక్స్	18
ఆర్థోపెడిక్స్	32
జనరల్ సర్జరీ	16
సైకియాట్రీస్టులు	9
నేత్రవైద్యులు సర్జరీ	24
ఇఎన్‌టి	11
చర్మ వైద్య నిపుణులు	12
పల్మమోలజీ	7
కమ్యూనిటీ మెడిసిన్	5
డెంటిస్ట్	01
రెస్పిరేటరీ మెడిసిన్	01

సొంతింటి కల.. సాకారమయ్యేదెలా..!

నారాయణపురంలో ముందుకుసాగని జగనన్న ఇళ్ల నిర్మాణాలు
రెండున్నరేళ్లుగా పడకేసిన ఇళ్ల నిర్మాణ పనులు
రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యమే కారణం
పట్టించుకోని ఉన్నతాధికారులు
అయోమయంలో లబ్ధిదారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో పేదల సొంతింటి కల సాకారమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు ఇక్కడ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. అసలు పేదల ఇంటి నిర్మాణం సాకారం అవుతుందా, లేదా అనే అయోమయంలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామంలో 206 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. వీరందరికీ ఇంటి స్థలాల కోసం 5.69 ఎకరాలు భూమి కావాల్సి ఉంది. అయితే నారాయణపురంలో అంత భూమి అందుబాటులో లేకపోవడంతో ఉంగుటూరు రెవెన్యూకు చెందిన రెండు చోట్ల 2.78 ఎకరాలు, మరో చోట 2.53 ఎకరాల భూమిని 2020లో ఎకరం రూ.54 లక్షల వంతున వైసిపి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో 2.78 ఎకరాల విస్తీర్ణంలో రూ.68 లక్షలతో ఈ ఏడాది జనవరిలో మెరక చేసి అందులో 103 ప్లాట్లు వేసి రాళ్లు పాతారు. అక్కడ లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

జగనన్న లే అవుట్‌లో జామాయిల్ తోట

జామాయిల్ చెట్లే అడ్డంకి..!

రెండో లేఅవుట్ భూమి 2.53 ఎకరాల విస్తీర్ణంలో జామాయిలు, టేకు, తాడి చెట్లు ఉన్నాయి. వాటిని తొలగిస్తే గానీ మెరక చేసేందుకు అవకాశం లేదు. అయితే అటవీశాఖ అధికారుల నుంచి అనుమతుల కోసం రెవెన్యూ అధికారులు చర్చోపచర్చలు చేస్తున్నారు. ఫారెస్టు అధికారుల నుంచి అనుమతులు వస్తేనే చెట్లు తొలగించాల్సి ఉంటుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. తొలుత జామాయిల్, టేకు, తాడి చెట్లు విలువ చాలా ఎక్కువగా అంచనా వేయడం, వాటిని కటింగ్ చేయడంలో సాంకేతిక సమస్యలు వచ్చినట్లు తెలుస్తోంది. అందులో చెట్లను రెవెన్యూ శాఖే కటింగ్ చేయించి కలపను వేలం వేయించి వచ్చిన సొమ్మును ప్రభుత్వానికి ఇచ్చేలా అధికారులు భావించినా కార్యరూపం దాల్చలేదు. రెవెన్యూ శాఖ కటింగ్ చేయించేందుకు వేసిన అంచనా ఖర్చుకు.. బయట చెట్లు కొట్టే బంటా కూలీల ధర, ట్రాన్స్‌పోర్టు ఖర్చులకు పొంతన లేకపోవడంతో సంబంధిత దస్త్రం జిల్లా అధికారుల వద్ద ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో లబ్ధిదారులు తమ సొంతింటి కల ఎప్పటికి సాకారమవుతుందోనని ఎదురు చూస్తున్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

భీమవరం రూరల్: ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాష్ట్రంలో పచ్చి నియంత పాలన సాగుతోందని, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తమ గోడు చెప్పుకునేందుకు ప్రయత్నిస్తుంటే జగన్ సర్కార్ అరెస్టులు, దాడులకు పాల్పడుతోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రతిపక్షాలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 144 సెక్షన్, 30 యాక్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమిర్శంచారు. ప్రజావేదిక కూల్చివేతతో దారి తప్పిన పాలన నేటికి పరాకాష్టకు చేరుకుందన్నారు. రాష్ట్రంలో రోడ్లు అత్యంత అధ్వానంగా ఉన్నాయని, రైతుభరోసా కేంద్రాలు నామమాత్రంగా మిగిలాయని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలను విద్యుత్ ఛార్జీలతో దోచేస్తున్నారని, పెరిగిన విద్యుత్ ఛార్జీలపై ఈ నెల తొమ్మిదో తేదీ సోమవారం నుంచి 15వ తేదీ వరకు వివిధ దశల్లో వామపక్షాలు ఆందోళనకు పిలుపునిచ్చాయన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్, కేంద్రంలో మోడీని గద్దె దింపడానికి భావ సారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పని చేస్తామన్నారు. టిడిపి, జనసేన ఇండియా కూటమిలోకి రావాలని ఆకాంక్షిస్తున్నామని, వీరిద్దరూ బిజెపితో కలిస్తే రాష్ట్రంలో జగన్ మళ్లీ గెలుస్తాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతిమంగా వైసిపి బిజెపితో వెళ్లి దేశాన్ని అధోగతి పాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, బొద్దాని నాగరాజు, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

విరాళాన్ని అందిస్తున్న కరాటం రెడ్డిబాబు నాయుడు

దాతల సహకారం హర్షణీయం

సీతా మహాలక్ష్మి వృద్ధాశ్రమానికి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో సీతా మహాలక్ష్మి వృద్ధాశ్రమానికి దాతలు అందిస్తున్న సహకారం హర్షణీయమని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమానికి బుట్టాయగూడెంకు చెందిన వర్జినియా పొగాకు రైతు సంఘం నాయకులు కరాటం రెడ్డిబాబు నాయుడు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధాశ్రమ నిర్వహణకు మరి కొంతమంది దాతలు ముందుకు వచ్చి వృద్ధులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జయవరపు శేఖర్, వామిశెట్టి వెంకటేశ్వరరావు, గరికిపాటి రవీంద్ర, వామిశెట్టి శివ, వామిశెట్టి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఆయాకు ఆర్థిక సాయం అందిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ ఆయాకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన సువార్తమ్మకు అంగన్‌వాడీలు ఆదివారం ఆర్థిక సహాయం చేశారు. ఆయాగా పనిచేసి గత సంవత్సరం పదవీ విరమణ పొందారు. ఇంటి వద్ద అనారోగ్యంతో బాధపడుతుండడంతో సిడిపిఒ నూరానీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ఆర్థిక సహాయం అందజేశారు.

రెయిలింగ్ పడిపోయిన పెద్దలంక వంతెన

దేవపూడి-ఈడేపల్లి మధ్య డ్రెయిన్‌పై ప్రమాదకరంగా ఉన్న కాలిబాట వంతెన

శిథిలావస్థలో ముదినేపల్లి వంతెనలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో డ్రెయినేజీలపై నిర్మించిన పలు వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ప్రజలు, రైతులు వాహనాల రాకపోకలు సాగించే నిమిత్తం ఈ వంతెనలు నిర్మించారు. అయితే కాలక్రమేణా ఈ వంతెనలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో ఎప్పుడు కూలి ప్రమాదం సంభవిస్తుందోననే భయం ప్రజలను వెంటాడుతోంది. ఈ వంతెనపై ప్రయాణం చేసే జనం ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

గుడివాడ - బంటుమిల్లి రోడ్డులో మండలంలోని ఉప్పరగూడెం మలుపు వద్ద పెదలంక మేజర్ డ్రెయినేజీపై నిర్మించిన పురాతన వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన నిర్మించి 65 ఏళ్లు అయ్యింది. గుడివాడ - బంటుమిల్లి మీదుగా మచిలీపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో ఈ వంతెన ఉంది. నిత్యం ఈ వంతెనపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఎంతో ప్రాధాన్యత ఉన్న వంతెన గోడలు బీటలు వాలి, రెయిలింగ్ పడిపోయి ప్రమాదభరితంగా ఉంది. రెయిలింగ్ లేకపోవడంతో గతంలో పలువురు ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయాల్లో డ్రెయినేజీలో పడి మృతి చెందారు. ఈ వంతెన ఇరుకు కావడంతో రెండు వాహనాలు తప్పుకునే అవకాశం లేదు. ఈ వంతెన ఎప్పుడు కూలిపోతోందోననే భయం ఈ ప్రాంత వాసులను వెంటాడుతోంది. ఈ వంతెనపై నుంచి నిత్యం ముదినేపల్లిలోని వివిధ విద్యాసంస్థలకు వందలాది మంది విద్యార్థులు స్కూల్ బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారు. అలాగే ఇదే డ్రెయినేజీపై

ఇబ్బందులు పడుతున్న ప్రజలు
పట్టించుకోని అధికారులు

ఈడేపల్లి - దేవపూడి గ్రామాల మధ్య నిర్మించిన కాలిబాట వంతెన కూడ శిథిలావస్థకు చేరి, ఏ క్షణానైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ వంతెన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. అంతేకాక ఈడేపల్లి, అల్లూరు బొమ్మినంపాడు, కొరగుంటపాలెం గ్రామాలకు వెళ్లే ప్రజలకు దగ్గర మార్గంగా ఉంది. ఈ వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. ఏ క్షణానైనా కూలిపోవచ్చు.

కూలిన పేరూరు, దేవరం వంతెనలు

దాకరం - పుట్లచెరువు రహదారిలో మండలంలోని పేరూరు వద్ద పోల్‌రాజ్ డ్రెయినేజీపై నిర్మించిన పురాతన వంతెన కుప్పకూలింది. ఈ వంతెన కూలి రెండు ఏళ్లు అయినా నేటికీ అధికారులు నూతన వంతెన నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఈ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీ సర్పంచి స్పందించి ప్రజలు, రైతులు రాకపోకలు సాగించేందుకు తాత్కాలికంగా కాలిబాట వంతెన నిర్మాణం చేశారు. అలాగే అన్నవరం - దేవరం గ్రామాల మధ్య అన్నవరం డ్రెయినేజీపై నిర్మించిన వంతెన కూడా గత ఏదాది కూలిపోయింది. దీంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆక్వా రైతులంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తాము పండించిన ఆక్వా ఉత్పత్తులను గ్రామం నుంచి బయటకు తీసుకువెళ్లేందుకు గాను డ్రెయినేజీలో తూములు ఏర్పాటు చేసి రహదారి సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు.

పట్టించుకోని అధికారులు

మండలంలోని పలు డ్రెయినేజీలపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా ఉన్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. వంతెనలు కూలి, ప్రమాదం జరిగి, ప్రజల ప్రాణాలు గాలిలో కలిస్తే తప్ప అధికారులకు చలనం రాదేమోనని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు, డ్రెయినేజీ అధికారులు స్పందించి కాలం తీరినా, శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో నూతన వంతెనలు నిర్మాణం చేసి, ప్రజల ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

నిధులు కోసం చూస్తున్నాం

డ్రెయినేజీ ఎఇ రాజ్‌కుమార్

నియోజకవర్గంలో 15 వరకు వంతెనలు శిథిలావస్థకు చేరాయి. వీటిలో 10 వంతెనల వరకు డ్రెయినేజీ శాఖకు సంబంధించిన కాగా, మిగతావి ఆర్అండ్‌బి శాఖ పరిధిలో ఉన్నాయి. మండలంలోని అన్నవరం - దేవరం, గురజ - మానికొండపాడు, ఈడేపల్లి - దేవపూడి గ్రామాల మధ్య శిథిలావస్థకు చేరిన వంతెనల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రాతిపాదనలు పంపాం. గాని ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పలు డ్రెయిన్లపై శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో నూతన వంతెనలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ప్రజాశక్తికి వివరణ ఇచ్చారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలి
ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలి
ధాన్యం మద్దతు ధర - కొనుగోలు సమస్యలపై
12న ఏలూరులో జిల్లాస్థాయి రైతు సదస్సు

ప్రజాశక్తి - దెందులూరు

2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,183(75 కేజీల బస్తాకు రూ.1637.25), ఎ గ్రేడ్ క్వింటాకు రూ.2203(75 కేజీల బస్తాకు రూ.1652.25) ప్రకటించిందని, ఈ ధర రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 12వ తేదీన ఏలూరులో సిఐటియు జిల్లా కార్యాలయంలో ధాన్యం గిట్టుబాటు ధర కొనుగోలు సమస్యలపై నిర్వహిస్తున్న జిల్లాస్థాయి రైతు సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ పోతునూరు శివారు ఉండ్రాజవరంలో ఆదివారం రైతుల సమావేశం నిర్వహించారు. సదస్సు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అదనంగా కేరళలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.900 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తోందని, మన రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ధాన్యం క్వింటాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసా కేంద్రం వద్ద నిర్ణయించిన తేమశాతం, తూకంతోనే మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి చేసుకోవాలని కోరారు. రైతుల నుంచి మిల్లులు వద్ద డబ్బులు వసూలు చేయడం ఆపాలన్నారు. నాణ్యమైన గోనె సంచులు ఇవ్వాలని, ఆర్‌బికెల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కల్లాల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ధాన్యం తోలిన వారంలో రైతులకు పేమెంట్స్ బ్యాంకులో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నిడమర్రు : రైతు సమస్యలపై జిల్లాస్థాయి రైతు సదస్సు జయప్రదం చేయాలని మండల కార్యదర్శి కోన శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నిడమర్రు మండల కమిటీ ఆధ్వర్యంలో భువనపల్లి, ఏనికేపల్లి, అడవికొలను గ్రామాలలో రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, క్వింటాకి రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. రైతులు, కౌలు రైతుల సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వారి సమస్యల మీద ఈనెల 12, 13 తేదీల్లో ఏలూరులో నిర్వహించే రైతు సదస్సును రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన కానూరురాజు, నేతి వెంకన్న, కలిసేటి వెంకటేశ్వరరావు, వంటాకుల రామన్న, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలకు మోక్షమెప్పుడో..!

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా 2019లో నూతన సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. నూతన పాలనకు సంబంధించి నూతన భవన నిర్మాణాలకు అప్పట్లో శంకుస్థాపనలు కూడా అట్టహాసంగా ప్రారంభం చేశారు. నిర్మాణాలు చేపట్టడానికి కాంట్రాక్టర్‌లు సైతం పోటీ పడటంతో వారికి పనులు అప్పగించింది. జీలుగుమిల్లి మండలంలోని మొత్తం 12 పంచాయతీలకు గాను 11 సచివాలయ భవనాల నిర్మాణాలను రెండు సంవత్సరాల క్రితమే కాంట్రాక్టర్లు ప్రారంభం చేశారు. అయితే నిర్మాణ పనులకు సంబంధించి మొదట్లో త్వరితగతిన పనులు చేపట్టారు.

తర్వాతి కాలంలో బిల్లులు కాస్త ఆలస్యం అయ్యేసరికి నిర్మాణాలను కొన్ని చోట్ల సగంలోనే నిలిపేశారు. దీనిపై ప్రభుత్వం నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులను మంజూరు చేసి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు మండలస్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించింది. ఎట్టకేలకు మండలంలో నాలుగు పంచాయతీల పరిధిలో మాత్రమే పూర్తిస్థాయిలో పనులు జరిగి నూతన సచివాలయలను ప్రారంభం చేశారు. వాటిలో పాలన కొనసాగిస్తున్నారు. మిగతా చోట్ల తాత్కాలిక భవనాలలోనే పాలన కొనసాగిస్తున్నారు.

ఇంకా మొత్తం 8 పంచాయతీలలో కొన్ని చోట్ల మాత్రం భవనాలు పూర్తవుతున్నాయి. మిగిలిన పంచాయతీలలో మాత్రం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం ఓ పక్క, అధికారుల అలసత్వంతో భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి.

జిల్లా యంత్రాంగం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. మండల అధికారులపై ఒత్తిడి తెచ్చి, కాంట్రాక్టర్లతో పనులను పూర్తి చేయించాలంటున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో సచివాలయాల నూతన భవనాల్లో పాలనను కొనసాగించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అసంపూర్తిగా నిర్మాణ దశలో ఉన్న సచివాలయ భవనం

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి : టిడిపి

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవగాహనలేని పరిపాలన కొనసాగిస్తూ, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని సూరేపల్లి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణులు చేస్తున్న నిరహార దీక్షకు మద్దతు తెలిపారు. ఈ నిరాహార దీక్షలో గద్దే రఘుబాబు, మల్లిబాబు, కొక్కిరిపాటి శోభనాద్రి, లక్కపాము కాంతారావు, పనగంట నాగేశ్వరరావు, రఘుబాబు, ఓబిలినేని ప్రసాద్, కొల్లి వెంకటేశ్వరరావు, గూట్రు వెంకటేశ్వరరావు, గూట్రు వలరాజు, కట్టుబోయిన సత్యం, గూట్రు అర్జునరావు, గూట్రూ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్రాన్ని ఆధునిక రంగంలో తీసుకొచ్చే ఘనత చంద్రబాబుకే ఉందని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. చంద్రబాబు అరెస్టునకు నిరసనగా ఆదివారం మండలంలోని గుడిపాడు గ్రామంలో పెద్ద ఎత్తున కాగడాలతో, కొవ్వొత్తులతో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, కృష్ణాజిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కొలి గంగారామ్, మందలపు ధర్మరాజు, మసిముక్కు సుబ్బారావు, కందుల పిచ్చయ్య, లక్కపాము కాంతారావు, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

ముసునూరులోని గుడిపాడులో టిడిపి ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ

జంగారెడ్డిగూడెం : చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా జంగారెడ్డిగూడెంలో టిడిపి కార్యాలయం, పట్టణ టిడిపి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం మండలంలోని గురవాయిగూడెంలో మండల టిడిపి అధ్యక్షులు సాయిల సత్యనారాయణ అధ్యక్షతన చంద్రబాబు నాయుడు అరెస్టును ఖండిస్తూ రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, మాజీ ఎంఎల్ఎ గంటా మురళీ రామకృష్ణ, గోర్రుముచ్చు గోపాల్ యాదవ్‌లు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును జనసేన తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపిని ఓడించేందుకు పోరాడుతామని తెలిపారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసైనికులు టిడిపితో కలిసి ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనికెళ్ల శ్రీనివాస్, పరిమి శ్యామ్, పొన్నగంటి అనిల్, దండమూడి రమణ, పరిమి వెంకట్రావు, మండవ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వంతెన కూలి ఆరేళ్లు.. నిర్మాణం ఇంకా ఎన్నాళ్లు..!

ప్రజాశక్తి - ఉంగుటూరు

రావులపర్రు - ఉంగుటూరు మధ్య పత్తేపురం పంట కాలువపై చిన్నపాటి వంతెన కూలి సుమారు ఆరేళ్లు దాటింది. నేటి వరకూ దాని స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సీతారాంపురం, రాచూరు, దొంతవరం, రావులపర్రు గ్రామస్తులు మండల కేంద్రమైన ఉంగుటూరుకు రావాలంటే ఇదే దగ్గర మార్గం. రావులపర్రు - ప్రకాశరావు ఆర్అండ్‌బి రహదారికి చెందిన మార్గంలో తోకలపల్లి మేజరు మురుగు కాలువ లాకర్ల సమీపంలో ఈ వంతెన ఉంది. రావులపురం, కాగుపాడు, రాచూరు, దొంతవరం రైతులు, ప్రజలు ఉంగుటూరు రావాలంటే పంట కాలువలో దిగి నీళ్లల్లో నడిచి రావాల్సి వచ్చేది. ఈ సమస్యను గుర్తించిన అప్పటి ప్రజాప్రతినిధులు ఎప్పుడో సుమారు ఐదు దశాబ్దాల క్రితం రైతుల సహకారంతో సుమారు నా లుగు మీటర్ల వెడల్పు, ఆరు మీటర్ల పొడవైన పునాదిరాళ్లపై వంతెన నిర్మించుకున్నారు.

దీంతో వ్యవసాయ ఉత్పత్తులు, ప్రజల రాకపోకలకు ఈ వంతెన ఎంతో కీలకంగా మారింది. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 16 వేల మంది ప్రజలు ఈ వంతెనను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. అలాంటి ఈ వంతెన స్లాబు దెబ్బతిని, 2019 ఎన్నికలకు ముందే కూలిపోయింది. అప్పటికి అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం మరమ్మతులు చేయించలేదు. ఎన్నికల అనంతరం ప్రస్తుత అధికార ప్రభుత్వం కూడా ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. స్థానికులే తాత్కాలికంగా ఈ వంతెన పక్కనుంచి పంట కాలువపై కంకర రోడ్డు నిర్మించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. రావులపర్రు నుంచి కాగుపాడు జడ్‌పి ఉన్నత పాఠశాలకు సుమారు 70 మంది విద్యార్థులు నిత్యం సైకిళ్లపై వెళ్లి వస్తున్నారు. కంకర దారి వర్షాకాలంలో జారుడుగా ఉంటోంది. ఏదైనా పొరపాటున సైకిల్ జారితే పంట కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా ఈ వంతెన నిర్మాణానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిఎం దృష్టికి తీసుకెళ్తా..
గంటా శ్రీలక్ష్మి, ఎంపిపి ఉంగుటూరు

ఈనెల 9న విజయవాడలో సిఎంతో వైసిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశం ఉంది. ఈ వంతెన సమస్యపై సిఎం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను.

పత్తేపురం పంట కాలువపై కూలిన వంతెన

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అందుబాటులో ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గత మార్చి, మే నెలలలో జరిగిన ఇంటర్‌మీడియట్ పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ మార్కుల ధ్రువపత్రాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందుబాటులో ఉన్నాయని కళాశాల ప్రిన్సిపల్ బి.సతీష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఉత్తీర్ణులైన విద్యార్థులు సోమవారం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయంలో సంప్రదించి, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సిందిగా ప్రిన్సిపల్ కోరారు.



సంతాప సభలో ఎంఎల్‌సి, నేతలు

'రైతాంగ సమస్యలపై కృషి చేసిన యెర్నేని'

కలిదిండి : రైతు సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేసిన వ్యక్తి యెర్నేని నాగేంద్రనాథ్(చిట్టిబాబు) అని వక్తలు తెలిపారు. మండలంలోని కొండూరులో చిట్టిబాబు సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, మాజీ ఎంపీ మాగంటి బాబు, తాడినాడ బాబు, మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, కామినేని శ్రీనివాస్, మేథావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, అగ్రికల్చర్ మిషన్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ ఎంఐఎస్ నాగిరెడ్డి, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, యార్లగడ్డ రవికుమార్, ఆంధ్ర, తెలంగాణ రైతాంగ నాయకులు బికెఎస్ కుమార్ స్వామి, యలమంచిలి శివాజీ, చంగల్ రెడ్డి, గద్దె శేషగిరిరావు, బొజ్జా దశరదరామిరెడ్డి, ఇ.సాంబశివరావు పాల్గొని మాట్లాడారు.

12న హుండీ లెక్కింపు

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసియున్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం ఈనెల 12వ తేది గురువారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ ఛైర్మన్ శౌంఠి నాగరాజు ఆదివారం తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సమక్షంలో జరుగుతుందని నాగరాజు తెలియజేశారు.

నేరాలు - ఘోరాలు

మూగజీవాలను రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మూగజీవులను రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన బట్ట గోవిందు, లావేటి యోగేంద్ర, బుద్ధాల లక్ష్మణరావు, కూడిపోయిన దాసు అనువారు రెండు వ్యాన్‌లలో 20 ఆవులు, 8 గిత్తలను శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా కబేళాకు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మక్కినవారిగూడెం వద్ద తనిఖీ చేసి మూగజీవులను నిర్బందించి తరలించడాన్ని గుర్తించామన్నారు. విఆర్ఓ సుభాష్ చంద్రబోస్ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసి, మూగజీవులను సంరక్షణ నిమిత్తం గోశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరు వ్యక్తులపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

కులం పేరుతో దూషించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన బోడా వెంకటేశ్వరరావు పిన్నమనేని మురళీ వద్ద కమతం పని చేస్తున్నాడు. హైస్కూల్ రోడ్డులో తుక్కు బాగా పెరిగి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని మురళీ ఈనెల 2వ తేదీన రోడ్డుకిరు వైపులా కలుపు మందు కొట్టించాడు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన మాలెంపాటి హరిబాబు, అతని కుమారుడు సంజయ్‌లు ఈనెల 5వ తేదీన కలుపు మందు కొట్టిన వెంకటేశ్వరరావును పిలిచి కులం పేరుతో దూషించి, చేతులతో కొట్టారు. వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రకటన
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి :: తణుకు
ఓ.ఎస్.నెం. 185/2017
బిట్వీన్:
వాది: కౌరు సత్యవతి
మరియు
ప్రతివాదులు:
గుత్తుల ఈశ్వరరావు మరియు వగైరా
5వ ప్రతివాది: గుత్తుల లక్ష్మి, భర్త: ఈశ్వరరావు, డో.నెం. 15-3/1, రామాలయం దగ్గర, బొక్కావారి పాలెం, భీమవరం, జె.సి.జె.
పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు మీయొక్క Appearance నిమిత్తం పలుమార్లు సమన్లు ఇచ్చియున్నప్పటికీ మీరు హాజరు కాకుండా కాలయాపన చేయుచు ఇందున, మీ యొక్క Appearance నిమిత్తం ది.10-10-2023న ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల పరోక్షముగా తీర్మానింపబడుదురని తెలియజేయడమైనది.
ఎన్.వి.ఎస్.ఎస్.పి.రామమోహన్
ఎన్.వి.ఎస్.రామానుజం
తణుకు, అడ్వకేట్స్, తణుకు.
8-10-23. సెల్: 99088 22433